స్వచ్ఛత వైపు అడుగులేవీ?

- పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే!
- రోడ్ల పక్కన పేరుకుపోతున్న నిల్వలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

పుట్టపర్తి అర్బన్: స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్న గాంధీజీ ఆశయాన్ని అధికారులు నీరుగారుస్తున్నారు. ప్రచార ఆర్భాటం తప్ప ఆచరణలో ఏ పల్లెలోనూ పరిశుభ్రత కనిపించడం లేదు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గతంలో మండలంలోని 14 పంచాయతీల్లో 38 మంది అంబాసిడర్లను నియమించారు. వారు రోజూ ఇంటింటా తిరిగి చెత్త సేకరించే వారు. పంచాయతీ సెక్రటరీలు, ఈఓఆర్డీలు, ఎంపీడీఓలు పర్యవేక్షించేవారు. సిబ్బందికి అవసరమైన పరికరాలు సమకూర్చి స్వచ్ఛ భారత్ నుంచి పారితోషికం అందించేవారు. కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత గ్రీన్ అంబాసిడర్లను తొలగించి, వారి స్థానంలో క్లాప్ మిత్ర పేరిట అధికార పార్టీ మద్దతుదారులైన 10 మందిని తీసుకున్నారు. అయితే వీరిచేత పని చేయించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో పల్లెల్లో ఏ వీధి చూసినా చెత్తతోనే దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల సేకరించిన చెత్తాచెదారాన్ని సైతం రోడ్డు పక్కన పడేసి కాల్చేస్తున్నారు. వీరిని చూసుకుని చికెన్ సెంటర్ నిర్వాహకులు, మార్కెట్లలో సేకరించిన చెత్త, కుళ్లిన కూరగాయలను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లే ముఖ ద్వారాల వద్ద దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.


పెడపల్లి వద్ద రోడ్డు పక్కనే చెత్తకుప్ప

ప్రబలుతున్న రోగాలు

గ్రామాల్లోకి వెళ్లి ఏ ఇంటిలో చూసినా ఒకరో ఇద్దరో రోగాలకు గురై మంచం పట్టిన వాళ్లు కనిపిస్తారు. సీజనల్ వ్యాధులతో పాటు వర్షాలకు కుళ్లిన చెత్త లో దోమలు విపరీతంగా దర్శనమిస్తున్నాయి. ముక్కు పుటాలు అదిరిపోయే దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇక వాహనాల్లో చెత్తను సంచుల్లో మూట గట్టి రోడ్డు పక్కనే పారబోస్తున్నారు.

ఆగిన పారితోషకం

గత ప్రభుత్వ హయాంలో ఒక్కో గ్రీన్ అంబాసిడర్‌కు రూ.6 వేలు ఇస్తుండగా కూటమి ప్రభుత్వం రాగానే స్వచ్ఛ భారత్ నుండి అందించే పారితోషకం నిలిపివేసింది. దీంతో సిబ్బంది పని చేయకుండా మానేశారు. గ్రామ పంచాయతీల్లో టీడీపీ మండల నాయకులు నియమించుకున్న సిబ్బందికి పంచాయతీల నుంచే పారితోషికం ఇవ్వనున్నారు. దీంతో పుట్టపర్తి మండలంలో కేవలం పెడపల్లి, కప్పలబండ పంచాయతీల్లో మాత్రమే సిబ్బంది పని చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే చాలా మందికి పని లేకుండా పోయిందని గ్రీన్ అంబాసిడర్లు వాపోతున్నారు.

పని మానేశాం

ప్రస్తుత ప్రభుత్వం సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదు. పంచాయతీల నుంచి జీతాలు ఇస్తారో లేదో తెలియక పని మానేశాం. మాలాంటి వాళ్లు ప్రతి పంచాయతీలోనూ ఉన్నారు. పని లేకపోవడంతో ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాం.

– లక్ష్మయ్య, పెడపల్లి, గ్రీన్ అంబాసిడర్

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో రోడ్డు పక్కన చేత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. క్లాప్ మిత్రలుగా ఉన్న సిబ్బందికి స్వచ్ఛ భారత కార్పొరేషన్ వేతనాలు ఇవ్వడం మానేసింది. దీంతో సిబ్బంది అంతా పనులు మానేశారు. ప్రస్తుతం పెడపల్లి, కప్పలబండ పంచాయతీల్లో ఐదుగురు చొప్పున పని చేస్తున్నారు. వారికి గ్రామ పంచాయతీల నుంచే వేతనం ఇవ్వాలి.

– నాగేశ్వరరెడ్డి, ఎంపీడీఓ, పుట్టపర్తి

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని డీఎస్పీ శ్రీనివాసులు, సీఐడీ డీఎస్పీ దైవప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని పారడైస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో దళిత, గిరిజనులపై దౌర్జన్యాలు, దాడులు, అత్యాచారాలను ఎలా నివారించాలో తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలను ఎలా అమలు పరుస్తారు, ఏ సమయంలో వాటిని వినియోగించాలో వివరించారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, కర్నూలు సీఐడీ ఇన్‌స్పెక్టర్లు వై.శ్రీనివాసులు, ప్రసాద్‌రావు, ఎంపీడీఓ సాయి మనోహర్, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజున్ కుబ్రా, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీరాములు పాల్గొన్నారు.

19 నుంచి ఆధార్ శిబిరాలు

ధర్మవరం రూరల్: మండలంలో ఈ నెల 19నుంచి 22 వరకు, అలాగే 26 నుంచి 29వ తేదీ వరకు ఆధార్ సంచార శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ శుక్రవారం తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలి

కదిరి అర్బన్: నేటి యువత బిర్సాముండాను ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించిన జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బ్రిటిష్ పాలకుల వలసవాద వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గిరిజన తెగకు చెందిన యోధుడు బిర్సా ముండా అన్నారు. బిర్సాముండా 25 ఏళ్లలోనే తరతరాల స్ఫూర్తిని కలిగించేలా చరిత్రలో నిలిచిపోయారన్నారు. ధర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద రాష్ట్రంలో 878 గ్రామాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈ పథకం కింద రాబోవు ఐదేళ్లలో గిరిజనులకు 20 లక్షల పక్కా గృహాలు, 2.35 లక్షల మంది గిరిజనులకు విద్యుదీకరణ, గిరిజన గ్రామాలకు 1000 సంచార మెడికల్ యూనిట్లతో పాటు 1000 వసతిగృహాలు, ఇంటర్‌నెట్, నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తారన్నారు. ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ, అర్బన్‌డెవలప్‌మెంట్ డైరెక్టర్ కాలా నాయక్, ఏబీవీపీఎస్ఎస్ నాయకులు చక్రనాయక్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

ముదిగుబ్బ: ప్రముఖ గిరిజన నేత బిర్సా ముండా జయంతి వేడుకలను రామస్వామి తండాలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూర్చే ప్రభుత్వ పథకాలను వ్యవసాయాధికారులు వివరించారు. గిరిజన రైతులకు భూ ఆరోగ్య పత్రాలను పంపిణీ చేశారు. డీఆర్సీ ఏడీఏ సనావుల్లా, కదిరి ఏడీఏ సత్యనారాయణ, ఎస్‌టీఎల్ ఏఓ శ్రీనాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే ధ్యేయం

బత్తలపల్లి: వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ పని చేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సి.వుల్లయ్య, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బత్తలపల్లి మండల పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు మదనాపు శ్రీనివాసులు అధ్యక్షతన ధర్మవరం డివిజన్ ఏపీయుడబ్ల్యూజే సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మవరం డివిజన్ అధ్యక్షుడిగా మోహన్(అనంత జనశక్తి, ధర్మవరం), గౌరవాధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి(సాక్షి, ధర్మవరం), ప్రధాన కార్యదర్శిగా జాంపుల అజయ్‌చౌదరి(సూర్య, బత్తలపల్లి), ఉపాధ్యక్షులుగా వీరనారప్ప(సాక్షి, తాడిమర్రి), వెంకటనాయుడు(ప్రజాభూమి, ముదిగుబ్బ), నరేష్(ఆంధ్రజ్యోతి, రామగిరి), వెంకటేష్‌చౌదరి(దిశ, ధర్మవరం), రామకృష్ణ(ఆంధ్రపత్రిక, సీకేపల్లి), రాంప్రసాద్(ఆంధ్రజ్యోతి, ధర్మవరం), సహాయ కార్యదర్శులుగా మహానందరెడ్డి(వార్త, సీకే పల్లి), ఆదినారాయణ(ఆంధ్రప్రభ, తాడిమర్రి), గురుప్రసాద్(ధర్మవరం సమాచారం, ధర్మవరం), కప్పల హరికృష్ణ(ప్రజాశక్తి, బత్తలపల్లి), ఆదినారాయణ(ఆంధ్రప్రభ, ధర్మవరం), రమణ(సూర్య, ధర్మవరం), కార్యనిర్వాహక కార్యదర్శిగా గణేష్(ఎన్‌టీవీ, ధర్మవరం), ట్రెజరర్‌గా మహాదేవరెడ్డి(సాక్షి, కనగానపల్లి), కార్యవర్గ సభ్యులుగా మదనాపు రాజశేఖర్(ఆర్‌టీఐ, బత్తలపల్లి), గోపాల్(ఆంధ్రరేఖ, ముదిగుబ్బ), వెంకటేష్(సూర్య, తాడిమర్రి), సుబ్బరాయుడు(వార్త, రామగిరి), వీరనారప్ప(వార్త, కనగానపల్లి), శ్రావణ్‌కుమార్(ఆంధ్రజ్యోతి, ధర్మవరం), నాగేంద్ర(హెచ్ ఎం టీవీ, సీకేపల్లి), నాగరాజు(అనంత జనశక్తి, ధర్మవరం), రమణ(నేషనలిస్ట్ హబ్, ధర్మవరం), సాకే శ్రీనివాసులు(10 టీవీ, బత్తలపల్లి)ను ఎన్నుకున్నారు. నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఎలక్ట్రానిక్ మీడియాసంఘం అధ్యక్షులు హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జయనందరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కోశాధికారి జీవీ నారాయణ, జిల్లా నాయకులు రమేష్, ఉద్దండం చంద్రశేఖర్, రాము, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ కమిటీ

గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి: గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు సూచించారు. శుక్రవారం బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సమస్యలపై గ్రామసలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీల రూపంలో విన్నవిస్తే విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

ఎన్పీకుంట: పెడబల్లి సచివాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ తగాదాలకు సంబంధించి 11 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ నరేంద్రకుమార్ తెలిపారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మండల సర్వేయర్ జిలాని, వీఆర్‌ఓ రఘు పాల్గొన్నారు.

అమడగూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గడిదంవారిపల్లిలో గ్రామసభను నిర్వహించినట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా రైతులు పలు దరఖాస్తులను అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రత్యేక స్పందనలో అర్జీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తకోట గ్రామసభలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు

తనకల్లు: సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్ప అన్నారు. భీమ్లానాయక్‌తండాలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మల్లిరెడ్డి, బొంతలపల్లి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సర్పంచులు రామచంద్రారెడ్డి, మునేనాయక్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటలపై ఆసక్తి పెంచుకోండి

ధర్మవరం రూరల్: రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై ఆసక్తి పెంచుకోవాలని ఆర్డీటీ ఎస్ఏడీఎల్ కో ఆర్డినేటర్ రుద్రయ్య సూచించారు. శుక్రవారం తుంపర్తి గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో మిశ్రమ ఆహార పంటలపై క్షేత్రస్థాయి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 169 మంది రైతులు, లీడర్లు, కార్యకర్తలు హాజరయ్యారు. ఆర్డీటీ ఎఫ్ ఎకాలజీ ధర్మవరం టీం లీడర్ కె. దస్తగిరి, ఎర్రిస్వామి, ఓబిళేసు, విష్ణువర్ధన్‌రెడ్డి, సంధ్య పాల్గొన్నారు.

రైతు సంఘం మండలాధ్యక్షుడిగా మల్‌రెడ్డి

ఎన్పీకుంట: రైతు సంఘం మండలాధ్యక్షుడిగా పి.చిన్నమల్‌రెడ్డి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం శాఖా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బడాసుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం మండలాధ్యక్షుడిగా పి.చిన్నమల్‌రెడ్డి, కార్యదర్శిగా టి.వెంకటరమణను ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గంగిరెడ్డి, కెకె రాజారెడ్డి, నాగరాజు, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం నార్సింపల్లితండా సమీపంలో శుక్రవారం పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా నాటుసారా తయారీ కోసం ఉంచిన 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ నాగరాజు, ఎస్ఐ ఉమామనోహర్ రాజు పేర్కొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతం


వ్రతం ఆచరిస్తున్న జంటలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలోని కల్యాణ మండపంలో శుక్రవారం 80 మంది జంటలతో సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. షిర్డీసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో అర్చకులు సత్యనారాయణస్వామి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దురలవాట్లకు దూరంగా ఉండండి

ఓడీచెరువు: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, విజ్ఞాన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఏఎస్ఐ కిశోర్ రెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన తప్పనిసరి

చెన్నేకొత్తపల్లి: బాలలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శ్రీసత్యసాయి జిల్లా బాలల సంరక్షణ అధికారిణి నాగలక్ష్మి సూచించారు. బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చట్టాలు, హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

పుట్టపర్తి రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుపతి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. సమావేశానికి 11 మంది హాజరుకాగా కోరం ఉండడంతో సమావేశాన్ని ప్రారంభించాలని భావించారు. కొందరు సభ్యులు రిజిస్టర్‌లో సంతకాలు చేయగా మరికొందరు నిరాకరించారు. సమస్యలు పరిష్కరించలేని సమావేశం ఎందుకని ప్రశ్నించారు. 20 వార్డు కౌన్సిలర్ రత్నప్ప చౌదరి ఆధ్వర్యంలో నలుగురు టీడీపీ కౌన్సిలర్లు ప్రారంభంలో వాదనకు దిగారు. మున్సిపాలిటీలోని పనులన్నీ ఇద్దరికే అప్పజెప్పడం ఏంటని అధికారులను నిలదీశారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించమని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని వారు కౌన్సిల్ మీట్ బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు.

అధికారులు తీరుపై మండిపాటు...

భగవాన్ సత్యసాయి బాబా జయంతి వేడుకలు మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయని తెలిసి కూడా అధికారులు సమన్వయంతో పని చేయకపోవడం పట్ల చైర్మన్ తుంగా ఓబులపతి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. సాయి భక్తులను కొందరు అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. చైతన్య జ్యోతి మ్యూజియంలో పని చేసే ఓ చిరు ఉద్యోగి టైటిల్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించి రూ.40 వేల లంచం అడిగారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న జీతాలు చాలవని లంచాలు కమీషన్లు రాబట్టే పనులు మాత్రమే పుట్టపర్తి మున్సిపాలిటీలో కొందరు అధికారులు చేస్తున్నారని సభ్యులు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని వారం రోజులైనా అనుమతి ఇవ్వకపోవడంపై చైర్మన్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మండిపడ్డారు.


అధికారుల తీరుపై మండిపడుతున్న చైర్మన్ తుంగా ఓబులపతి

జయంత్యుత్సవ ఏర్పాట్లలో విఫలం..

సత్యసాయిబాబా జయంత్యుత్సవాల ఏర్పాట్లలో రాష్ట్ర ప్రభుత్వానికి విఫలమైనట్లు చైర్మన్ విమర్శించారు. భక్తులకు కనీస వసతులు కల్పించడం లేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తిప్పన్న, లక్ష్మీనారాయణరెడ్డి, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, అనిత, నాగమణి, వెంకటరమణమ్మ, రత్నప్ప చౌదరి, జయప్ప, కోఆప్షన్ సభ్యులు అగరబత్తి నాగరాజు, రఫీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

తాడిమర్రి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని కస్తూర్బా బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ వాణిశ్రీ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. అనంతరం గ్రంథాలయాధికారి విద్యార్థినులతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: విద్యార్థి దశలోనే పుస్తక పఠనం అలరుచుకోవాలని గ్రంథాలయ అధికారి జయసింహరాజు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో రకరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన సంపదకు నిలయాలు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మేడాపురం గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సచివాలయం హార్టికల్చర్ అధికారి రుక్సానా, గ్రంథాలయాధికారి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కనగానపల్లి: నిరంతరం పుస్తక పఠనం ద్వారా మంచి విజ్ఞానాన్ని పొందవచ్చని గ్రంథాలయాధికారి గోవిందు విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కేజీబీవీ విద్యార్థినులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకతపై వివరించారు.


తాడిమర్రిలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థినులు

రామగిరి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి వెంకటేష్ తెలిపారు. రోజూ ఒక పుస్తకం చదవడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అంతకుముందు సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సత్యనారాయణ యాదవ్, లెక్చరర్లు రమేష్ నాయక్, అల్లాబకాష్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

తనకల్లు: గ్రాంథాలయం సేవలను వినియోగించుకోవాలని లైబ్రేరియన్ మస్తాన్‌వలి కోరారు. స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమడగూరు: మహమ్మదాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ చంద్రానాయక్, లైన్‌మెన్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కుటాగుళ్ల వద్ద 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. జేకేపల్లి, మహమ్మదాబాద్, కస్సముద్రం పంచాయతీ రైతులు సహకరించాలని కోరారు.

హమాలీ యూనియన్ ఏర్పాటు

కనగానపల్లి: మండలంలోని తగరకుంట గ్రామంలో శుక్రవారం హమాలీ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. సీపీఐ పార్టీ అనుబంధంగా ఏర్పాటు చేసిన ఈ కమిటీని శ్రీ సత్యసాయి జిల్లా ఏపీ రైతు సంఘం కార్యదర్శి మహదేవ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గులగానప్ప పేరుతో ఏర్పాటు చేసిన ఈ కమిటీకి అధ్యక్షుడుగా శివానంద, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ట్రెజరర్‌గా నాగరాజుతో 13 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

పంచాయతీ భవనంలో పశువులు తోలొద్దు


బలిజపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ మాధవరెడ్డి

ఎన్పీకుంట: బలిజపల్లి పంచాయతీ భవనంలో పశువులు తోలొద్దని, మరోసారి పునరావృతమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ మాధవరెడ్డి గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం ఆయన భవనాన్ని పరిశీలించారు. అంతకు ముందు పి కొత్తపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో తడి, పొడి చెత్తను సేకరించి వేరుచేయాలని సిబ్బందికి సూచించారు. సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ఫీల్డ్ పనిమీద బయటికి వెళ్లినప్పుడు తప్పకుండా మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లాలని సూచించారు. పెడబల్లి పంచాయతీలో సిబ్బంది చేపట్టిన హౌస్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్‌ను పరిశీలించారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న స్పందన ఆసుపత్రి సిబ్బంది

ధర్మవరం అర్బన్: హాస్టల్‌లోని విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు స్పందన ఆసుపత్రి వైద్యులు డాక్టర్ టీఎం బషీర్, వై సోనియా తెలిపారు. డాక్టర్ బషీర్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆసుపత్రి మేనేజర్ బాబా ఫక్రుద్దీన్, దిల్దార్ పట్టణంలోని 450 మంది హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు దుప్పట్లు అందించడం సంతోషంగా ఉందని వైద్యులు తెలిపారు.

సబ్సిడీ డ్రిప్ పరికరాలు సద్వినియోగం చేసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సుదర్శన్

నల్లచెరువు: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ డ్రిప్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎంఐపీ పీడీ సుదర్శన్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ, ఐదు ఎకారాలు పైన ఉన్న రైతులకు 70శాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్ పరికరాలను అందజేస్తామన్నారు. అలాగే స్ప్రింక్లర్లపై 5 ఎకరాలు ఉన్న రైతులకు 55 శాతం అంతకన్నా ఎక్కువ భూమి ఉన్న రైతులకు 45 శాతం సబ్సిడీతో అందిస్తామన్నారు. అవకాశాన్ని మండల రైతులు సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఏఓ భారతి, ఉద్యాన శాఖ అధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు ఘన సన్మానం


చెన్నకృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

పుట్టపర్తి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ హెచ్‌ఎం చెన్నకృష్ణారెడ్డి శకుంతలమ్మ దంపతులను శుక్రవారం బుక్కపట్నంలో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి చెన్నకృష్ణారెడ్డి సేవలను కొనియాడారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేష్, భాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రాజగోపాల్, శంకర్, నాగభూషణ, సుధాకర్ శ్రీనివాసరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి, రామమోహన్‌రెడ్డి, సోమ్లానాయక్, క్రిష్టప్ప, రిటైర్డు హెచ్‌ఎం నంజిరెడ్డి, చితంబర్ రెడ్డి పాల్గొన్నారు.

గృహాల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి: సొంతిల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం గృహాలు మంజూరు చేస్తుందని ఆ శాఖ ఏఈ హరినాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు గ్రామ పంచాయతీ సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. భార్యా, భర్తల ఆధార్‌కార్డులు, రేషన్ కార్డు, కులం, ఆదాయ సర్టిఫికెట్లు, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని గృహం లేని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్తీక దీపం.. సర్వపాప హరణం..

సాక్షి నెట్‌వర్క్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రధానంగా మహిళలు ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసంలో దీపారాధన చేస్తే సర్వపాపాలు తొలగి సకల శుభాలు జరుగుతాయని భక్తుల నమ్మకం. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లో రాత్రి జ్వాలాతోరణం నిర్వహించారు.


కదిరిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


బత్తలపల్లి శివాలయం ముందు జ్వాలాతోరణం


ఓడీచెరువు: అక్కదేవతల ఆలయంలో కార్తీక శోభ



సీకేపల్లిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు,చిల్లవారిపల్లి శ్రీకాటికోటేశ్వర క్షేత్రంలో ..


విద్యుద్దీపాల అలంకరణలో హరహర క్షేత్రం